
ప్రజాశక్తి
గురువారం 25 జనవరి 2024 5
విజయనగరం



మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం, పార్వతీపురం మన్యం ఉమ్మడి జిల్లాల్లో మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో బ్యాంకులకు సంబంధించిన కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, సెక్షన్ 138 ఎన్ఐ యాక్టు కేసులు, ఎక్సైజ్ కేసులు, మోటార్ ప్రమాద బీమా కేసులు, కుటుంబ వివాదాలు, కార్మిక సంబంధిత కేసులు, విద్యుత్, నీటి పన్నుకు సంబంధించిన కేసులు, భూ సేకరణ కేసులను పరిష్కరించుకోవచ్చని సూచించారు. పూల్‌బాగ్ కాలనీ హనుమాన్ నగర్‌లోని ఎంఆర్‌విఆర్‌జిఆర్‌పిజి బాయ్స్ హాస్టల్ ప్రాంగణంలోని నూతన కోర్టు భవనంలో నిర్వహించే లోక్‌అదాలత్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో

పూర్తిస్థాయి సౌకర్యాలు

- క్షేత్రస్థాయిలో పర్యటించిన కలెక్టర్
- కులగణన సర్వే ప్రక్రియ పరిశీలన
- ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై ఆరా



కులగణన సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-రాజాం, చీపురుపల్లి, గరివిడి

అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాలుగా వినియోగించే భవనాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపు, విద్యుత్తు సదుపాయం, ఫర్నీచర్, సరైన నేమ్ బోర్డులు తదితర ఆరు అంశాలు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ఈ మేరకు జిల్లాలోని పలు మండలాల్లో ఆమె బుధవారం పర్యటించారు. రాజాం మున్సిపాలిటీ పరిధిలోని వస్త్రపురి కాలనీలో, బొద్దాం గ్రామంలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. వసతులపై ఆరాతీశారు. కులగణన సర్వేను తనిఖీ చేశారు. వాలంటీర్లతో మాట్లాడి, సర్వే ప్రక్రియపై ఆరా తీశారు. వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో తనిఖీ చేశారు. కార్డుల పంపిణీ నెమ్మదిగా జరుగుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్డుల్లో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఉందని, కొత్తవారిని కూడా జత చేయవచ్చని సూచించారు. చీపురుపల్లి పట్టణంలో శివరాం రోడ్డులో నాలుగో సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న కులగణన, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని పరిశీలించారు. విజయరాంపురం ఎంపిపి పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. గరివిడి మండలం కోడూరు ఎంపిపి పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లోని వసతులను పరిశీలించారు. బిఎల్ఒలతో మాట్లాడారు. కార్యక్రమంలో రాజాం నియోజకవర్గ ఇఆర్ఒ సుధారాణి, ఆర్‌డిఒ బి.శాంతకుమారి, కులగణన జిల్లా నోడల్ ఆఫీసర్ కె.సందీప్ కుమార్, తహశీల్దార్లు తాడ్డి గోవింద, సురేష్, ఎంపిడిఒ జి.గిరిబాల, తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఆర్థిక బకాయిలు చెల్లించాలని

యుటిఎఫ్ ఆధ్వర్యాన కొవ్వొత్తులతో ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పిఆర్‌సి, డిఎ, ఎస్ఎల్, పిఎఫ్, ఎపిజిఎల్ఐ ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం కలెక్టరేట్ వద్దనున్న ఎన్‌టిఆర్ విగ్రహం నుంచి జ్యోతిరావుపూలే విగ్రహం వరకు ఈ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ ఆర్థిక బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అందులో భాగంగా ఈ నెల ఈ నెల 31, ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో రిలే దీక్షలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, సిహెచ్ తిరుపతి నాయుడు, జి.రాజారావు, ఎన్.సత్యనారాయణ, అల్లు శంకర్రావు, సిపిఎస్ జిల్లా కన్వీనర్ పి.రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.డి.అనిత తెలిపారు. అయోధ్య మైదానం, గురజాడ కళాభారతిలో ఓటర్ల దినోత్సవ కార్యక్రమాలు ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అయోధ్య మైదానం నుంచి పాఠశాల విద్యార్థులతో మానవహారం, నేను ఓటు వేస్తాను అనే ఆకృతిలో ప్రదర్శన, ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన శకటం ఆవిష్కరణ ఉంటాయని వివరించారు. అయోధ్య మైదానం నుంచి గురజాడ కళాభారతి వరకు పులివేషాలు, బుట్టబొమ్మలు, కర్రసాము, తప్పెటగుళ్ల వంటి సాంస్కృతిక బృందాలతో ఒక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గురజాడ కళాభారతిలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందికి అవార్డులు, ప్రశంసాపత్రాల బహూకరణ ఉంటాయని తెలిపారు. కోట చుట్టూ మహిళలతో మానవహారం కూడా ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు.

బాలికల భద్రతే ముఖ్యం

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

ప్రజాశక్తి-విజయనగరం

చదువుతో పాటు ఆడపిల్లల భద్రత కూడా ముఖ్యమని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. ఆడపిల్లలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పదంగా వ్యవహరించే వారిపై తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా స్త్రీ శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఆడపిల్లలు జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని, దానిని సాధించడానికి కృషి చేయాలని సూచించారు. విద్యతో పాటు నైతిక విలువలు పాటించాలని, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలని తెలిపారు. చదువుకునే వయసులో సెల్‌ఫోన్ వినియోగం అవసరం లేదన్నారు. ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో అన్ని వసతులను కల్పిస్తూ విద్యను అందిస్తోందని, ఈ అవకాశాలను బాలికలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళల, బాలల పరిరక్షణ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని, చదువుకునే వయసులో పెళ్లి ప్రస్తావన మంచిది కాదని అన్నారు. అనంతరం బాలికల సంక్షేమం కోసం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, స్వచంద సంస్థల ప్రతినిధులు, సిడిపిఒలు, చదలవాడ ప్రసాద రావు, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంటౌన్ : బాలికల భద్రతకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి తెలిపారు. స్థానిక మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో చైల్డ్ రైట్స్ అడ్వొకసీ ఫౌండేషన్, జిల్లా ఫోరమ్ ఫర్ చైల్డ్ రైట్స్ సంయుక్తంగా రూపొందించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎపిడి విజయగౌరి, విజయనగరం జిల్లా ఫోరమ్ ఫర్ చైల్డ్ రైట్స్ సహాయ కార్యదర్శి పీరుబండి సత్యవతి, డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కోఆర్డినేటర్ కోరుకొండ వరలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎ.నాగరాజు, సిడిపిఒలు ఎస్తేరురాణి, లైజనింగ్ ఆఫీసర్ విద్య పాల్గొన్నారు.

అందరి సహకారంతో నగర అభివృద్ధి

మేయర్ విజయలక్ష్మి



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అందరి సహకారంతో రానున్న రోజుల్లో సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని మేయర్ విజయలక్ష్మి, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వివి రాజేష్ అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఎజెండాలో పొందుపరిచిన 20 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో మిగిలి ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టేలా అధికారులను ఆదేశించామన్నారు. సమావేశంలో కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, బోనెల ధనలక్ష్మి, పిన్నింటి కళావతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను బ్యాంకర్లు అనుసరించాలి

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం



సమావేశంలో మాట్లాడుతున్న జెసి అశోక్

వ్యవసాయ, అనుబంధ రంగాలైన మత్స్య, పశు, ఉద్యాన రంగాలలో రైతులకు రుణాలను మంజూరు చేసేటప్పుడు నిర్ణయించిన స్కేల్ ఆప్ ఫైనాన్స్ ప్రకారంగానే మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిసిసిబి ద్వారా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను పలు శాఖలకు చెందిన అధికారులతో చర్చించి నిర్ణయించారు. పాడి, మత్స్య యూనిట్లకే కాకుండా, ఇంకా ఏ రకమైన రుణాలు ఇస్తున్నారో, వాటికి ఏ మేరకు రుణం అవసరం అవుతుందో ఆయా అధికారులు ప్రతిపాదనలను డిసిసిబికి అందజేయాలన్నారు. ఆయిల్‌పాం, అపరాల సాగు, పశుగ్రాసం తదితర యూనిట్లకు స్కేల్ ఆ ఫైనాన్స్‌ను నిర్ణయించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిసిసిబి సిఇఒ జనార్దన్, ఎల్‌డిఎం శ్రీనివాసరావు, నాబార్డు డిడిఎం నాగార్జున, వ్యవసాయ, మత్స్య, ఉద్యాన పశు సంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోసాలకు పాల్పడిన కేసుల్లో

ఆస్తులు రికవరీలు చేయాల్సిందే

నెలవారీ నేర సమీక్షలో ఎస్‌పి దీపిక



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

మోసాలకు పాల్పడిన కేసుల్లో నిందితుల నుంచి ఆస్తులను రికవరీ చేయాల్సిందేనని ఎస్‌పి దీపిక పోలీసు అధికారులకు స్పష్టంచేశారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న పోలీసు అధికారులతో మాసాంతర నేర సమీక్షా సమావేశాన్ని బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వివిధ పోలీసు స్టేషనుల్లో నమోదు అయిన చీటింగు కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి ఆస్తులను కూడా రికవరీ చేయాలని, సంబంధిత కోర్టుల్లో అభియోగ పత్రాలు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా క్రిటికల్ పోలింగు కేంద్రాలను, గ్రామాలను సందర్శించాలని సూచించారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత చర్యలు చేపట్టాలన్నారు. పెండింగులో ఉన్న నాన్ బెయిలబుల్ వారంట్లను అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల సమయంలో సమస్యలు సృష్టించేందుకు అవకాశం ఉన్న రౌడీషీటర్లను, వ్యక్తులను గ్రామ స్థాయిలో గుర్తించి, వారిని బైండోవరు చేసి, బాండ్లను తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాల్లో గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అక్రమంగా మద్యం విక్రయించే వారిపై, రవాణకు పాల్పడే వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను అధికారులు సందర్శించి, ఆకస్మిక తనిఖీలు చేయాలని సూచించారు.

ఎన్నికల ప్రచారం కోసం అనుమతులు కోరుతూ వివిధ పార్టీల నాయకులు చేసే దరఖాస్తు వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేకంగా ఒక రిజిష్టరును ప్రారంభించాలన్నారు. అనంతరం దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను ఎస్‌పి సమీక్షించి, దర్యాప్తు పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి దిశా నిర్దేశం చేశారు.

ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్‌పి ఎం.దీపిక ప్రత్యేకంగా అభినందించి, వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో ఎఎస్‌పి అస్మా ఫర్హీన్, ఎస్ఇబి డిఎస్ఎన్ఒ ఎస్.వెంకటరావు, ట్రైయినీ ఐపిఎస్ మండ జావలి అల్ఫాన్స్, డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, పి.శ్రీధర్, ఎ.ఎస్.చక్రవర్తి, వీరకుమార్, న్యాయ సలహాదారు వై.పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

బిసిలను అణగదొక్కుతున్న వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి-విజయనగరంకోట

వైసిపి అధికారంలోకి వచ్చిన వెనుక తరబడిన తరగతులను సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అణగదొక్కుతున్నారని తూర్పుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ కంది మురళినాయుడు తెలిపారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జయహో బిసి సభను విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సభతో నగరంలోని బిసిల్లో మంచి ఉత్సాహం వచ్చిందని చెప్పారు. వైసిపి ప్రభుత్వ హయాంలో నిర్మాణ రంగం కుదేలై, బిసిలు ఉపాధికి దూరమై రోడ్డున పడ్డారని తెలిపారు. మళ్లీ టిడిపి అధికారంలోకి ఎప్పుడొస్తుందా? అని బిసిలంతా ఎదురుచూస్తున్నారని తెలిపారు. సమావేశంలో కార్యక్రమంలో బిసి నియోజకవర్గ అధ్యక్షులు కోండ్రు శ్రీనివాసరావు, నాయకులు ముద్దాడ చంద్రశేఖర్, వేచలపు శ్రీనివాసరావు, పేరిశెట్టి గోపి, బోను కుమార్, పట్నాల వెంకటేష్, ఆర్.అప్పలనాయుడు, ఇప్పిలి రామారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో పతకాల పంట



పతకాలు సాధించిన విద్యార్థులతో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర స్థాయి తైక్వాండో సబ్ జూనియర్ ఖేలో ఇండియా క్యారెట్ ఎంపికలో జిల్లాకు చెందిన క్రీడాకారులకు పతకాల పంట పండింది. మొత్తం 9 పతకాలను సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను బుధవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభినందించారు. ఫిబ్రవరి 2 నుండి రాయపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డివి చారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

27న న్యాయవిజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం

మానవ అక్రమ రవాణా వల్ల బాధితులైన వారికి, లైంగిక దోపిడీకి గురైన బాధితులకు చట్టపరంగా ఉన్న రక్షణలపై అవగాహన కలిగించడంపై న్యాయ విజ్ఞాన సదస్సును ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.హెచ్.వి.లక్ష్మీకుమారి తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటల నుంచి నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న విఆర్ కన్వెన్షన్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పోలీసు శాఖ, స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులకు అవగాహన కల్పించనున్నట్టు పేర్కొన్నారు.

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాష్ట్ర ఎస్.టి.కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు తల్లి డి.మంగమ్మ(80) బుధవారం విజయనగరంలో మృతి చెందారు. అనారోగ్యంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చిన ఆమె మధ్యాహ్నం 4.30 గంటల సమయంలో మృతి చెందినట్లు ఎస్‌టి కమిషన్ క్యాంపు కార్యాలయం ప్రతినిధులు తెలిపారు. ఆమె మృతదేహాన్ని విజయనగరంలోని కామాక్షి నగర్‌లో గల ఎస్.టి.కమిషన్ చైర్మన్ శంకరరావు నివాసంలో వుంచారు. గురువారం ఉదయం నగరంలోని కొత్తపేట స్వర్గధామంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నారు.



జ్యోతిప్రజ్వలన చేసి సెమినార్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్

సిటియులో జాతీయ సెమినార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో 'గిరిజన చరిత్రపై రచనలు' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సెమినార్ బుధవారం ప్రారంభమైంది. సిటియు విసి కట్టిమణి మాట్లాడుతూ రాష్ట్రంలోని గిరిజనుల చరిత్ర మొత్తాన్ని నమోదు చేసి భావితరాలకు బదిలీచేసేందుకు యూనివర్సిటీ శ్రీకారం చుట్టినున్నట్లు తెలిపారు. మైసూర్ ఆర్ఐఇ ప్రొఫెసర్ మల్లి గాంధీ, పాండిచ్చేరికి చెందిన ప్రొఫెసర్ బి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గిరిజన చరిత్ర మూలాలు, వలస పాలనా కాలంలో అవి ఎలా నమోదయ్యాయో వివరించారు. కార్యక్రమంలో ఎయు ఆంత్రోపాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ పీడీ సత్యపాల్, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ టి శ్రీనివాసన్, డీన్ స్కూల్ ఆఫ్ సోషల్ స్టడీస్ ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు, ఫైనాన్స్ ఆఫీస్ ప్రొఫెసర్ జెఎం మిశ్రా, గిరిజన అధ్యయన విభాగాధిపతి, అనిరుధ్ కుమార్, సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దివ్య కొణికల్, ఎఒ ఎన్.వి.ఎస్.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

డ్రైవర్లు అంకితభావంతో విధులు నిర్వహించాలని డిపిటిఒ సిహెచ్.అప్పలనారాయణ తెలిపారు. విజయనగరం ఆర్‌టిసి డిపోలో రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా డ్రైవర్ల దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి డ్రైవర్లు నిత్యం వందలాది మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నారని తెలిపారు. బస్సు కండీషన్, డ్రైవింగ్ చేసే సమయంలో ఏకాగ్రత ఉండాలని తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా సర్వీస్ చేయాలని సూచించారు. ఇంధనం ఆదా చేయాలన్నారు. వాహనాల నిర్వహణపై అవగాహన, ఎప్పటి కప్పుడు మరమ్మతుల ద్వారా జరుగుతున్న ప్రమాదాలు, మరణాల సంఖ్యను తగ్గించడం సాధ్యమని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, బి.ఆదినారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

స్థానిక ఆర్‌టిసి వర్క్‌షాప్ వద్దనున్న జోనల్ స్టాఫ్ శిక్షణ కళాశాలలో జోనల్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్.. రోడ్డు భద్రతా వారోత్సవాలను ప్రారంభించారు. రహదారి భద్రత చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌టిసి అధికారులు, డ్రైవర్లు

చిట్టెంపాడులో డిఎంహెచ్ఓ పర్యటన

శృంగవరపుకోట: మండలంలోని చిట్టెంపాడు గ్రామంలో బుధవారం డిఎం అండ్ హెచ్ఓ స్థానిక వైద్య సిబ్బందితో పర్యటించి గిరిజనులకు వైద్య సేవలను అందించారు. గ్రామానికి చేరుకొని డాక్టర్ల బృందంతో రక్త పరీక్ష శాంపిల్స్ తీసుకొని అందర్నీ పరీక్షించారు. ఇక్కడ ముగ్గురు పిల్లలు, ఒక మహిళ చనిపోవడం చాలా బాధగా ఉందన్నారు. సిట్టంపాడు, గోనపాడు ఈ రెండు గ్రామాలకు కలిపి అతి తొందరలోనే ఒక ఆశా వర్కర్ పోస్ట్‌ను మంజూరు చేస్తానని చెప్పారు. శృంగవరపుకోట పట్టణంలో గర్భిణీలకు హాస్టల్ వసతి ఏర్పాటు చేస్తానని, పేషెంట్ కండిషన్ బట్టి ఎస్.కోట ఏరియా ఆసుపత్రి నుంచి డైరెక్ట్‌గా కేజీహెచ్‌కు పంపించే విధంగా చేస్తామని, కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ట్రైబల్స్‌కు ఎస్‌టిసెల్ ద్వారా మందులు, రక్త నిల్వలు ఇప్పించే విధంగా కలెక్టర్‌కి పూర్తి నివేదిక అందించి, ఇదే విషయాన్ని హెల్త్ రాష్ట్ర అధికారికి పంపిస్తానని చెప్పారు.

క్యాట్ పరీక్షల్లో 'శ్రీచైతన్య' ఘనవిజయం

ప్రజాశక్తి- విజయనగరం

నిరంతర పోటీ పరీక్షలతో విద్యార్థులను ముందంజలో నిలబెట్టే రింగ్‌రోడ్డులో గల శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు క్యాట్ (నాలెడ్జి ఎసెస్మెంట్ టెస్ట్)లో తమ సత్తాను చాటారు. 40 వేలకు పైగా నగదును, మెడల్స్, ప్రశంసా పత్రాలను సాధించారని పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షకులు వి.శ్రీనివాసరావు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్. శ్రీధర్ బాబు తెలిపారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఎసెస్మెంట్ టెస్ట్‌లో 110మంది విద్యార్థులు మెడల్స్, 111మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్స్ సాధించారని చెప్పారు. క్యాట్ పరీక్షల్లో విజయాన్ని సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఉపాధ్యాయ వర్గాన్ని పాఠశాల డీన్లు సత్యనారాయణ, సాయి కిషోర్, అప్పలనాయుడు, సూర్య చంద్రలు అభినందించారు.

'చిట్టి గురువులు'ను సందర్శించిన ఢిల్లీ బృందం

నెల్లిమర్ల: జరజాపుపేటలో నిర్వహిస్తున్న చిట్టిగురువులు కార్యక్రమం అమలు తీరును ఎన్‌సిఈఆర్‌టి, సిఎన్‌సిఎల్ బృందం సందర్శించి పరిశీలించింది. చిట్ట గురువులు కార్యక్రమంలో నేర్పుతున్న అభ్యాసకులతో మాట్లాడి ఈ కార్యక్రమం ఉపయోగాలు, నిత్య జీవితంలో వాటి ప్రభావాన్ని తెలుసుకున్నారు. చిట్టిగురువులతో మాట్లాడుతూ వారు బోధనలో ఎదుర్కొన్న సమస్యలను, వారి అనుభవాలు, వారి బోధనకు అనుసరించిన వ్యూహాలను తెలుసుకున్నారు. భవిష్యత్‌లో ఈ కార్యక్రమం రాష్ట్రం, దేశంలో విస్తరణ గూర్చి చర్చించారు. ఈ కార్యక్రమంలో సిఎన్‌సిఎల్, ఎన్‌సిఈఆర్‌టి న్యూఢిల్లీ బృంద సభ్యులు శివ, రేవతి, హర్షిత, మస్తాన్, వయోజన విద్య ఉప సంచాలకులు ఎ.సోమేశ్వర రావు, ఉపాధ్యాయులు ఆల్తి మురళీ కృష్ణ, మెప్మా సిఎంఎం గోవింద రావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

తెర్లాం: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ ఎస్ రామకృష్ణ, ఎపిఒ సుశీల ఉపాధి సిబ్బందితో పనులపై సమీక్షించారు. హార్టికల్చర్ స్థలాల గుర్తింపు, ఇంకుడు గుంతలు, పనిదినాల కల్పన, బిల్లుల చెల్లింపులు, కొత్త పనుల గుర్తింపు, మస్తర్లు తదితర అంశాలపై క్లస్టర్ వారీగా సమీక్షించారు. హార్టీకల్చర్ వృద్ధి చేయడానికి మండల పరిధిలో కనీసం 200 ఎకరాలు పైబడి సమకూర్చాలన్నారు. 200 ఇంకుడు గుంతలు నిర్మించడానికి స్థలాలను గుర్తించాలన్నారు. నియమాలు అనుసరించి పనిదినాలను కల్పించి వాటికి బిల్లుల చెల్లింపులకు ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలన్నారు. హౌసింగ్ పనిదినాలను సద్వినియోగం చేసుకోడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని పాటించాలి

శృంగవరపుకోట: ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని పాటించాలని ఓటరు అక్షరక్షిత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు అన్నారు. ఈనెల 26న జరగనున్న 75వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా బుధవారం పట్టణంలోని విజ్ఞాన్ జ్యోతి కాలేజీలో విద్యార్థులకు సూర్యారావు భారత రాజ్యాంగం పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పినట్లు ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని పఠించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు వెంకట్రావు, వేదిక ప్రతినిధి జీ ధనుంజయ్, పాల్గొన్నారు.

విద్యారంగంలో పిఎఎల్ సువర్ణావకాశం

నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో పిఎఎల్ సువర్ణావకాశమని ఎంఇఒలు యు.సూర్యనారాయణ మూర్తి, ఈపు విజయ్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పిఎఎల్) ల్యాబ్‌ను వారు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పిఎఎల్ సువర్ణావకాశమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 500 పాఠశాలలకు మాత్రమే ఈ ల్యాబ్ సౌకర్యం ప్రభుత్వం కల్పించిందన్నారు. దీనిలో భాగంగా ఈ పాఠశాలకు ఈ అవకాశం రావడం గర్వించదగ్గ విషయమని చెప్పారు. ఈ ల్యాబ్‌ను వినియోగించుకుని విద్యార్థులు గణితంలో తమకు అర్థం కాని విషయాలన్నీ నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ఆనందమూర్తి, పాల్గొన్నారు.

రోడ్డు భద్రత.. ప్రతిఒక్కరి బాధ్యత

శృంగవరపుకోట: రోడ్డు భద్రత పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని స్థానిక ఆర్‌టిసి డిపో మేనేజర్ కె రమేష్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా ఆర్టిసి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందితో బుధవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. హ్యాపీ డ్రైవర్స్ డే కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లకు పూలు, చాక్లెట్లు పంచామన్నారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని క్రమశిక్షణ కోసం ప్రత్యేక ట్రైనింగ్ ఇస్తున్నామని చెప్పారు. ప్రతిరోజు ఉదయం జరిగే గేట్ మీటింగ్ ద్వారా రోడ్డు భద్రత గురించి వివరిస్తున్నామన్నారు. అనంతరం ఆర్టిసి డిపో నుంచి దేవి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి సిబ్బంది సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతతతోనే పూర్తి ఆరోగ్యం సాధ్యం

రామభద్రపురం: మానవాళి ప్రశాంతంగా జీవన యానాన్ని కొనసాగిస్తే పూర్తి ఆరోగ్యం సిద్ధిస్తుందని శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగానూ ఆరోగ్యంగా ఉండాలని నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ – నీడ్ సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఫెసిలిటేటర్ శంకర రావు, ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివించాలి

బొబ్బిలి: ఆడపిల్లలను చదివించాలని డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీ కోరారు. స్థానిక కెజిబివిలో బుధవారం బాలికల దినోత్సవం నిర్వహించారు. లింగ వివక్షత నివారించాలని, ఆడపిల్లలను గౌరవించాలని కోరారు. ఆడపిల్లలను చదివిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

1900 మందికి కళ్లద్దాలు పంపిణీ

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేట, లక్ష్మీపురం, సంకిలి, దేవుదల గ్రామాలలో ఈఐడి ప్యారి ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరంలో 2100 మందికి ఆప్తాలమిక్ వైద్యులు ఎస్ రామమూర్తి, అనిల్ బృందం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఉచిత మందులతో పాటు 1900 మందికి కళ్లద్దాలను ఉచితంగా ప్యారి సుగర్స్ ఎవిపి పట్టాభి రామిరెడ్డి, హెచ్.ఆర్ హెడ్ మురళీకృష్ణ, లక్ష్మీపురం సర్పంచ్ తేజ వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మజ్జిరాముడుపేట సర్పంచ్ కరణం శ్రీనివాస రావు, లక్ష్మీపురం ఎంపిటిసి ఎర్నేన అప్పలనాయుడు, సుగర్స్ సిబ్బంది స్వామి, మెడికల్ సిబ్బంది సేవలందించారు.

జాతరలో ముగ్గుల పోటీలు

వేపాడ: మండలంలో వల్లంపూడిలో శ్రీ సాంబమూర్తి జాతర సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 31 మంది పాల్గొని తలబడ్డారు. విజేతలకు మొదటి బహుమతిగా ఎలక్ట్రికల్ కుక్కర్, రెండో బహుమతిగా సాదా కుక్కర్, మూడవ బహుమతిగా ఇఫ్ఫ్ కిట్లు, నాలుగవ బహుమతిగా బిగ్‌బాస్ స్కిట్లు అందించారు. అనంతరం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం గ్రామ పెద్దలు, సాంబశివ సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు సిద్ధం కండి


ప్రజాశక్తి- బొబ్బిలి

బాగా చదవండి పరీక్షలకు సిద్ధం కండి అని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు ముందు ఫిబ్రవరి 4న జరగనున్న ప్రజ్ఞా పరీక్షలను వినియోగించుకోవాలన్నారు. ఇటువంటి పరీక్షలు నిర్వహించి విద్యార్థులలో ఉన్న భయాందోళనలను పోగొట్టి విద్యార్థులలో ఉన్న ప్రతిభను ప్రోత్సహించడం కోసం ఎస్ఎఫ్ఐ కృషి చేస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 10వ తరగతికి జరుగు ప్రజ్ఞా వికాస పరీక్ష కరపత్రాలను బొబ్బిలి మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ బొబ్బిలి మండల అధ్యక్ష కార్యదర్శులు మణి కుమార్, కిరణ్, సహాయ కార్యదర్శి సాయి మణి బుధవారం విడుదల చేశారు.

తెరుచుకోని అంగన్వాడీ కేంద్రాలు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో సకాలంలో అంగన్వాడి కేంద్రాలు బుధవారం తెరుచుకోలేదు. రెండు కేంద్రాలు ఏకంగా సాయంత్రం వరకు తెరుచుకోకపోవడం విశేషం. సచివాలయ సిబ్బంది సకాలంలో తాళాలు ఇవ్వకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. మండలంలో 90 అంగన్వాడి కేంద్రాలు ఉండగా కార్యకర్తలు ఎప్పటిలాగే ఉదయం 9 గంటలకు కేంద్రాల వద్దకు చేరుకున్నారు. కానీ సచివాలయ సిబ్బంది సుమారు 11 గంటల తర్వాత కేంద్రాల వద్దకు వచ్చి తాళాలు ఇచ్చారు. అంతవరకు చిన్నారులతో కలిసి కేంద్రం బయటనే కూర్చోవలసిన పరిస్థితి ఏర్పడింది. ముందు రోజే సమ్మె విరమిస్తున్నట్లు సమాచారం తెలిసినప్పటికీ అధికారులు కూడా పట్టించుకోకపోవడం విశేషం. మండలంలోని చిన కౌలువాడ అంగన్వాడి కేంద్రం తాళాలు ఇవ్వకపోవడంతో సాయంత్రం వరకు తెరుచుకోలేదు. ముంజేరు -2 అంగన్వాడి కేంద్రం తాళాలు సాయంత్రం 5 గంటలకు అందజేశారు. సచివాలయ సిబ్బంది సమయానికి వచ్చి తాళాలు ఇవ్వకపోవడంతో అంగన్వాడి కార్యకర్తలు పిల్లలు ఇబ్బందులు పడ్డారు.



తెరుచుకోని చినకౌలువాడ అంగన్వాడీ కేంద్రం

అంగన్వాడీలకు తాళాలు ఇవ్వకపోవడం అన్యాయం

పూసపాటిరేగ: సమ్మె విరమించి జాయినింగ్ లెటర్ ఇచ్చి బుధవారం నుండి అంగన్వాడీలు తెరవడానికి వెలితే తాళాలు ఇవ్వకపోవడం అన్యాయమని సిఐటియు నాయకులు బచ్చల సూర్యనారాయణ అన్నారు. మండలంలోని అంగన్వాడీలంతా తాళాలు లేక ఆరుబయటే పిల్లల్ని పెట్టుకొని కూర్చోవాల్సి వచ్చిందన్నారు. తాళాలు అడిగితే జాయినింగ్ లెటర్ ఇవ్వాలని సచివాలయ ఉద్యోగులు కోరడం ఘోరమన్నారు. మండలంలోని కందివలస, అల్లాడపాలెం సెంటర్‌లకు సంబందించి బాలామృతం ప్యాకెట్లును రోడ్డుమీద విసిరేసి కాంట్రాక్టర్‌లు వెళ్లిపోవడం సరికాదన్నారు. అంగన్వాడీలపై కక్ష సాదింపు చర్యలు చేపడుతున్నట్లు ఉందన్నారు. దీనిపై అధికార్లు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కదిలిన అధికారులు

- చేపల చెరువుల పరిశీలన
- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని వెంకంపేట గ్రామ సమీప చేపల చెరువులకు అనుమతులు, వాటి నిర్వహణపై బుధవారం రెవెన్యూ, మత్స్యశాఖ అధికారుల్లో కదలిక వచ్చింది. దీంతో తహశీల్దార్ బి. సుదర్శన్ రావు, మత్స్యశాఖ మండల అసిస్టెంట్ కిరణ్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వెంకంపేట మాజీ సర్పంచ్ బుగత రాజు అనుమతులు లేని అక్రమ చేపల చెరువు నిర్వహణ చేపట్టడం జరిగిందని గుర్తించారు. చేపల చెరువులకు అనుమతులు లేవు అనే కథనం ప్రజాశక్తిలో ప్రచురించడంతో రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు స్పందించి పరుగులు తీశారు. గ్రామ అడంగల్ ప్రాప్తికి సచివాలయ ఉద్యోగులు, సర్వేయర్, ఆర్ఐ ఎం. రేవతి బృందంతో మేప్ ఆధారంగా జిరాయితి, ప్రభుత్వ భూమి కనుగొన్నారు. గత ఏడేళ్లగా చేపల చెరువులకు అనుమతులు లేవని గుర్తించారు. చేపల చెరువు నిర్వహణకు మత్స్య శాఖ అధికారులను సంప్రదించి అన్ని దస్త్రాలతో అనుమతులు తీసుకుంటే విచారణ చేపడతామన్నారు. అంతవరకు చేపల చెరువు నిర్వహణ చేయవద్దని, ధిక్కరిస్తే చర్యలు తప్పవు అని నిర్వాహుకున్ని హెచ్చరించారు.



రికార్డులను పరిశీలిస్తున్న తహశీల్దార్ సుదర్శన్‌రావు

టిడిపిలో 652 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- రేగిడి

మండలంలో పెద్ద శిర్లాం, ఖండ్యాం గ్రామాల్లో వైసిపిని వీడి 652 కుటుంబాలు బుధవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. వైసిపి మండల జెసిఎస్ కన్వీనర్, పెద్ద శిర్లాం మాజీ సర్పంచ్ పాలవలస రామచంద్రనాయుడు, మాజీ సర్పంచ్ సంచాన అప్పలనాయుడు, పి. శ్రీరాముల నాయుడు, కోట్ల సింహాద్రి నాయుడు, ఎం రాములమ్మ, కన్నంనాయుడు, ఆర్. సత్యం నాయుడు, అమ్మినాయుడు 400 కుటుంబాలతోనూ, ఖండ్యాంకు చెందిన వైసిపి నాయకులు గుల్వే హరిప్రసాద్ 200 కుటుంబాలతోనూ వైసిపి వీడి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి కోండ్రు మురళీ సమక్షంలో టిడిపిలో చేరారు. కోండ్రు మాట్లాడుతూ వైసిపి పాలనలో గ్రామీణ ప్రాంతాలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని అన్నారు. చంద్రబాబు వస్తేనే గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శాసపు గోవింద నాయుడు, పాలూరి రామనాయుడు, కర్నేన మహేష్, గిరడా మహేష్, గేదెల బాలమురళి, మజ్జి శ్రీను, గురవాన రమేష్, గురవాన నారాయణ రావు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని చీకటిపేట గ్రామంలో వైసిపికి చెందిన సుమారు 100 మంది బొబ్బిలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బేబీ నాయన సమక్షంలో టిడిపిలో చేరారు. గ్రామానికి చెందిన చీకటి తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకోవడం ఆనందంగా ఉందని పార్టీలో చేరిన వారు చెప్పారు. ఈ సందర్భంగా బేబీ నాయన మాట్లాడుతూ వైసిపికి రెండు నెలల టైం ఉందని ఆ తర్వాత జెండా కూడా కనబడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెంకట నాయుడు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి అమరావతి సురేష్, మాజీ ఎంపిపి ఎన్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : గొంప

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గస్థాయి టిడిపి నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారిక సాధన దిశగా మహిళలను ఆర్థిక అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని ఉద్దేశంతో ఉచిత టైలరింగ్, బ్యూటిషన్ శిక్షణ ఫిబ్రవరి 15వ తేదీ నుండి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు ఫిబ్రవరి 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఐదు మండలాలకు కలిపి 80 మంది మహిళలను టైలరింగ్ కోసం, 20 మంది మహిళలను బ్యూటీషియన్ కోర్సుల కోసం ఎంపిక చేసి శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్స్ అందజేసి, మహిళల ఉపాధి కల్పనకు కృషి చేస్తామన్నారు. ఎస్.కోట మండలంలో దరఖాస్తు చేసుకునే మహిళలు టిడిపి విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్ (9398428283), జామి మండలం వారు లగుడు రవికుమార్ (9440540102), ఎల్.కోటకు సంబంధించి గనివాడ సతీష్ (8247218928), వేపాడ మండలానికి సంబంధించి గొంప వెంకటరావు (9848738205), కొత్తవలస మండలం గొరపల్లి రాము (7981399908)లకు ఫోన్ చేసి దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఫిబ్రవరి 15వ తేదీ నుండి ఎస్.కోట పట్టణంలో ఉన్న గొంప కార్యాలయం వద్ద శిక్షణ ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు రాయవరపు చంద్రశేఖర్, లగుడు రవికుమార్, గుమ్మడి భారతి, ఇప్పాక త్రివేణి, జుత్తాడ రామసత్యం, ఎం.మంగరాజు, బంగారు నాయుడు, వసి శ్రీనివాస్ పాల్గొన్నారు



మహిళా సాధికారిక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గొంప కృష్ణ

విద్యార్థులకు ట్యాబులు పంపిణీ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పోలిపల్లి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కర్రోతు వెంకటరమణ చేతుల మీదుగా 67 మంది విద్యార్థులకు వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇందిర, సచివాలయ కన్వీనర్ పతివాడ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ట్యాబ్‌ను అందజేస్తున్న సర్పంచ్ వెంకటరమణ

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర'


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నియోజకవర్గ స్థాయి ఆడదాం ఆంధ్ర పోటీలను నగర మేయర్ విజయలక్ష్మి, ఎంపిపి మామిడి అప్పలనాయుడు ప్రారంభించారు. బుధవారం రాజీవ్ క్రీడా మైదానంలో ఐదు క్రీడాంశాలలో నిర్వహించిన పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో సాగాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: నగర పంచాయతీలో ఆడుదాం ఆంధ్ర నియోజక వర్గ స్థాయి పోటీలు బుధవారం స్థానిక థామస్ పేట పుట్ బాల్ గ్రౌండ్‌లో నిర్వహించారు. అగురు వీధి సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజినీ, వైస్ ఛైర్మెన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, నగర పంచాయతీ కో ఆప్షన్ సభ్యులు చిక్కాల సాంబశివరావు, కమిషనరు పి. బాలాజీ ప్రసాద్, ఎంపిడిఒ జి.రామారావు, ఇఒపిఆర్‌డి కె.సింహాద్రి, వైద్య బృందం, పీడీలు, పిఇటిలు, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

చీపురుపల్లి: మండల స్థాయిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలను ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష లు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైసిపి మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, జిల్లా యువజన నాయకులు బెల్లాన వంశీకృష్ణ, చీపురుపల్లి పట్టణ అధ్యక్షుడు పతివాడ రాజారావు, స్కూల్ ఛైర్మన్ కరణపు ఆదినారాయణ, ఎంపిటిసిలు, నాయకులు, పాల్గొన్నారు.

శృంగవరపుకోట: గురువారం నుంచి ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల క్రీడా కోఆర్డినేటర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు ఎంపిడిఒ శేషుబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. మగవారికి పోటీలను డాక్టర్ వరలక్ష్మి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ, తెన్ను బొడ్డవర క్రీడా మైదానంలో ప్రారంభమవుతాయని, క్రికెట్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 27న మహిళలకు కబడ్డీ, కోకో, వాలీబాల్ పోటీలను డాక్టర్ వరలక్ష్మి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ క్రీడామైదానంలో గవర్నమెంట్ బాలుర ఉన్నత పాఠశాలలో బ్యాడ్మింటన్ మహిళలకు ఉంటుందని అందుకు సిద్ధం చేసినట్లు శ్రీరాములు తెలిపారు.



నెల్లిమర్ల: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

వెనుకబడిన తరగతుల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- చీపురుపల్లి

వెనుకబడిన వర్గాల వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని టిడిపి చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. బుధవారం మండలంలో తన క్యాంపు కార్యాలయం ఆవరణలో నిర్వహించిన జయహో బిసి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసిపి నాయకులు వెనుకబడిన తరగతులను తీవ్ర మోసం చేశారని ఆరోపించారు. టిడిపి హయాంలో చంద్రబాబు ఆదరణ పథకం ద్వారా రజకులకు, నాయీబ్రాహ్మణలకు, విశ్వబ్రాహ్మణలకు, యాదవులకు, చేనేత కార్మికులకు పని ముట్లు ఇచ్చేవారన్నారు. ఆసరా పేరుతో జగన్ రెడ్డి అక్క చెల్లమ్మలను మోసం చేస్తున్నారని డ్వాక్రా రుణమాఫీ అనేది ఒక జగన్నాటకమేనని అన్నారు. మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి పదవిలోకి వచ్చాక మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని ధ్వజమెత్తారు. అంగన్వాడీలు తమ హక్కుల కోసం పోరాటం చేస్తుంటే వారిని భయభ్రాంతులకు గురి చేసి వారిపై దాడులు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముల్లు రమణ, వెన్నె సన్యాసి నాయుడు, రౌతు కామునాయుడు, దన్నాన రామ చంద్రుడు, పైల బలరాం, మహంతి అప్పలనాయుడు, శనపతి శ్రీనివాసరావు, సప్ప సూరప్పడు, అరతి సాహు, దన్నాన సూరప నాయుడు, రౌతు నారాయణ రావు, గవిడి నాగరాజు, మీసాల నవీన్, మండల అప్పలనాయుడు, పనస మణికంఠ, అమ్మారావు, పట్నాన ఈశ్వరరావు, కోట్ల కృష్ణ, మీసాల కాశీ, వెంప డాపు లక్ష్మి నాయుడు, గంట్యాడ సత్యనారాయణ, మీసాల శ్రీధర నాయుడు, వలిరెడ్డి సంతోష్, బాణాన రాము, మామిడి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం ఇప్పించి న్యాయం చేయండి

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మహిళల నిరసన

ప్రజాశక్తి -బొబ్బిలి

ఇంటి స్థలం ఇప్పించి న్యాయం చేయాలని రామభద్రపురం శ్రీరామ్ నగర్ కాలనీకు చెందిన ఇద్దరు పేద మహిళలు డిమాండ్ చేశారు. రామభద్రపురం మండల కేంద్రంలో అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అనర్హులకు ఇస్తున్నారని ఆరోపిస్తూ పి.పార్వతి, కె.సింహాచలం బుధవారం ఆర్‌డిఒ కార్యాలయం ముందు ప్లకార్డులను పట్టుకుని బైటాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు సొంత ఇల్లు, ఇంటి స్థలం లేనప్పటికీ అధికారులు ఇంటి స్థలం ఇవ్వడం లేదని వాపోయారు. అద్దె ఇంటిలో నివాసముంటున్నామని, పేద కుటుంబం కావడంతో అద్దెలు చెల్లించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 90రోజులు ఇంటి స్థలానికి దరఖాస్తు చేసుకున్నప్పటికి ఇవ్వడం లేదని చెప్పారు. అనర్హులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒ సాయిశ్రీకు వినతిపత్రం అందజేశారు. దర్యాప్తు చేసి న్యాయం చేస్తామని ఆర్‌డిఒ హామీ ఇచ్చారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళలు

పౌరుషానికి ప్రతీక బొబ్బిలి యుద్ధం

ప్రజాశక్తి- బొబ్బిలి

పౌరుషానికి ప్రతీకగా బొబ్బిలి యుద్ధం నిలుస్తుందని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన అన్నారు. బొబ్బిలి యుద్ధం దినోత్సవం సందర్భంగా బుధవారం యుద్ధ స్తంభం వద్ద యుద్ధంలో ప్రాణ త్యాగం చేసిన వీర సైనికులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొబ్బిలి యుద్ధంలో తాండ్రపాపరాయుడు, సైనికులు వీరోచితంగా పోరాడి ప్రాణాలను త్యాగం చేశారన్నారు. బొబ్బిలి యుద్ధంలో వీర సైనికులు త్యాగంతో బొబ్బిలి పౌరుషంగా గుర్తింపు వచ్చిందన్నారు. బొబ్బిలి యుద్ధాన్ని నేటి తరానికి తెలియజేసేందుకు సినిమాలు, బుర్రకథలు, నాటికలు రూపంలో కళాకారులు సజీవం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బి.విజయచంద్ర, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



యుద్ధ స్తంభం వద్ద నివాళులర్పిస్తున్న బేబినాయన

తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి నియోజకవర్గంలో టిడిపి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం భీమిలి సభను జయప్రదం చేయాలని పట్టణ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పని చేస్తున్నట్లు చెప్పారు. బొబ్బిలి నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ టిడిపి విజయం సాధిస్తుందని టిడిపి నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాజులు బినామీ ఆస్తులను రెగ్యులర్ చేసుకునేందుకు రాజకీయాల్లోకి వచ్చారని ఆరోపించారు. తాను భూకబ్జా చేసినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైస్ ఛైర్మన్లు చెలికాని మురళి, జి.రమాదేవి, పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, ఇంటి గోపాలరావు, జెసిఎస్ కన్వీనర్ విస్సు, కార్యకర్తలు పాల్గొన్నారు.

26న బొబ్బిలిలో నిరసన

బొబ్బిలి: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుపరచకుండా వ్యవసాయ, పారిశ్రామిక, రవాణా, ఖనిజ సకల సంపదలను ఆదాని, అంబానీ తదితర కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందని ఈ విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న ఉదయం 10 గంటలకు నిరసన చేపడతామని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి గోపాల్, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు తెలిపారు. బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బొబ్బిలి ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద జరగనున్న ఈ నిరసన కార్యక్రమానికి సంయుక్త రైతు సంఘాలు, అన్ని ట్రేడ్ యూనియన్లు ఐక్యవేదిక పిలుపు మేరకు రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మిక సంఘాలు, ప్రజలు నిరసనలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు మెరిగాని గోపాలం, ఎఐటియుసి జిల్లా డిప్యూటీ సెక్రెటరీ మునకాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు జగనన్న ఆసరా

ప్రజాశక్తి - పూసపాటిరేగ

అక్క చెల్లెమ్మలకు ఆసరాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉన్నారని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ సురేష్ బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్‌విఎస్ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణంలో 4వ విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వరుసగా నాలుగో ఏడాది వైయస్ఆర్ ఆసరా కార్యక్రమంలో భాగంగా మండలంలో ఆసరా కింద లబ్ది పొందిన మొత్తం 1573 సంఘాలకు గాను 17,495 మంది లబ్ధిదారులకు సుమారు రూ.49.31 కోట్ల చెక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అక్క చెల్లెమ్మలకు పెద్ద అన్నగా ఆసరాగా నిలిచిన మన ముఖ్యమంత్రికి మనమంతా కృతజ్ఞతలు తెలపాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపిని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అందవరపు సూరిబాబు, ఎంపిపి మహంతి కళ్యాణి, జెడ్‌పిటిసి సీతాలక్ష్మీ, వైస్ ఎంపిపిలు అల్లాడ రమేష్, చంటిరాజు, వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, ఎఎంసి ఛైర్‌పర్సన్ చిక్కాల అరుణ, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు, నాయకులు మహంతి జనార్దనరావు, పిఎసిఎస్ ఛైర్మన్ మహంతి లక్ష్మణరావు, సర్పంచి టొంపల సీతారాం పాల్గొన్నారు.



మహిళలకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సీలు

ఘనంగా ఓటర్ల దినోత్సవం

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక విద్యా వనరుల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారులు జి.శ్రీదేవి, బి.శ్రీనివాస రావు ఆధ్వర్యంలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాల విద్యార్థులకు ఓటు విలువ, ఓటర్ చైతన్యంపై అవగాహన కల్పించి, వ్యాసరచన, డిబెట్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. గెలిపొందిన విద్యార్థులకు తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా సహకారంతో బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వై.అర్జునరావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బహుమతులతో విద్యార్థులు

రామభద్రపురం: 14వ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో వివిధ అంశాల పై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. తహశీల్దార్ సులోచనరాణి, ఎంఇఒ తిరుమల ప్రసాద్‌ల ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ, చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రామభద్రపురం, ఆరికతోట, రొంపల్లి, బూసాయవలస జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. వీరికి ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా దాలినాయుడు వ్యవహరించగా ఆయా స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్లు, పాల్గొన్నారు.

20 మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి గ్రామానికి చెందిన కుమార్ బెల్ట్ షాపు నడుపుతున్నట్లు గుర్తించి అతని వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఉంగరాడ మెట్ట నుంచి స్వగ్రామానికి అక్రమంగా మద్యం బాటిళ్ల తీసుకువెళ్ళడంతో దాడులు జరిపారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజారావు తెలిపారు.

కోడి పందేలపై దాడి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని నర్సంపేట గ్రామంలో అక్రమంగా కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వారిపై స్థానిక పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. కోడిపందేలు ఆడుతున్న వారిలో ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద రూ. 650 నగదు, ఐదు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గోపాలరావు వెల్లడించారు. ఈ దాడుల్లో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు